# భరతమాత గుండె పగిలింది

తమిరిశ జానకి

నాయుడు గారింట్లో జూలీ బౌమంది గేటు తీసుకుని వొస్తున్న రావుల్ని చూస్తూనే ఆ ఇంటికి వొచ్చే వాళ్ళందరూ నాయుడుగారి కిచ్చినంత గౌరవమూ దానికీ ఇవ్వవలసిందే

ఆ కుక్కకి బయపడుతూ వొంగి వొంగి సలాము చేస్తున్నంత వినయంగా దాని వైపు చూస్తూ ఒక్కొక్క అడుగే ముందు కేశాడు రావులు అది కట్టేసి ఉందన్న ధైర్యమే వాడిని అడుగులు ముందుకి వెయ్యనిచ్చింది

బౌ బౌ మంటూనే ఉంది అది నాయుడిగారి ఉప్పు తిన్న విశ్వాసంతో

జూలీ ఎస్వీ రంగారావు గొంతులా ఖంగుమంది లోపల్నించి ఓ కంఠం ఆ వెంటనే దాని తాలూకు ఆకారం, చిరంజీవి హెయిర్ కట్టూ కృష్ణంరాజు మీస కట్టూ శోబన్‌బాబు పంచె కట్టూ కమల్‌హసన్ కమీజు కట్టూ శరత్‌బాబు కళ్ళజోడు ప్రేము కట్టూతో రజనీకాంత్‌లా సిగరెట్టు నోట్లోకి విసురుకుంటూ బాగ్యరాజ్‌లా ఓర చూపులు చూసుకుంటూ, కాదల్‌మన్నన్ జెమినీ స్మైల్‌తో, నడిగర్ తిలకం శివాజీ హుందాతనంతో మొత్తమ్మీద రంగనాథ్ పర్సనాల్టీతో రంగమ్మీదకొచ్చింది

ఆ శాల్తీయే రంగబాబు నాయుడుగారు వయసెంతో లేదు ముప్ఫయి అయిదే కానీ ఉంది ఆస్తి మూడు నాలుగు తరాలు తిన్నా తరగనిది తండ్రీ తాత ముత్తాతలు కూడబెట్టింది అర్థబలం అంగబలమే కాదు కావల్సినంత పొగరూ పట్టలేనంత గర్వం ఆ ఊళ్ళో తనేం చేసినా చెల్లిపోతుందన్న తిమ్మిరితో కూడిన ధైర్యం కూడా ఉన్నాయి నాయుడికి అతనికుంది అంతస్తు అతనికుంది మూడు లక్షలు కట్నంగా తెచ్చి మొగుడంటే దేవుడే అని నమ్ముకున్న కట్టుకున్న వాడు కండ కావరంతో కంఠం పిసికినా సరే నాలిక వెళ్ళబెట్టాలే తప్ప నోట్లోంచి మాట రాకూడదని తాను ఈడేరక ముందు నించీ నాయనమ్మ చేత పాఠాలు వినీవినీ వ్యక్తిత్వమంటే ఎరగని ఓ ప్రాణం ఉన్న బార్య అనే బొమ్మ

ఎవరు నువ్వు? ఏం కావాలి? యజమాని గొంతులో చిరాకు కనిపెట్టి యదాశక్తి తనుకూడా ఆ వొచ్చిన వ్యక్తి మీద అదికారం దర్పం చూపిస్తూ మళ్ళీ బౌమంది జూలీ రావులి వైపు తిరిగి

బయం బయంగా చేతులు కట్టుకు నిలబడ్డ రావులు అతివినయంగా జవాబిచ్చాడు సింహస్వప్నంలాంటి నాయుడుగారికి ఆయనగారి గ్రామ సింహానికి కంబైన్డ్‌గా అయ్! నేను రావుల్నండి అయ్ ఇక్కడ మీకాడ బట్టలుతికె కొండాలమ్మ మా ఇంటిదండి అయ్ మా పిల్లగాడికి ఆదాత్తుగా వొంతులై పోతున్నాయండి పిల్లాడి పేనం కడగట్టి పోతా ఉందండి నీర్సంతో ఆసుపత్రికే తీసుకుపోతదో ఇంటోనే ఎదన్నా మందునూరి పోస్తదో ఓసారి చూసుకుంటొదని పిలుచుకుపోదామనొచ్చానండి ఇక్కడున్నట్టు మల్లా వొచ్చేస్తదండి అయిదు నిముసాల్లో... ఒక్కసారి పిల్లగాడు అమ్మే కావాలని ఏడుస్తున్నాడండీ

నీ కేమన్నా మతిపోయిందా? కసురుకున్నాడు నాయుడు సిగరెట్టు బూడిద మటుకు సుతారంగా దులిపాడు

అయ్ చేతులు మరింత గట్టిగా బిగించి కట్టాడు రావులు

